సాధారణ ప్రచురణ(రూ.1,000)కు
ఎంపికయిన కథ

# ఇదో ఋతువు

టి.పి. హేమమాలిని

'పత్‌ఝడ్, సావన్, బసంత్, బహార్... ఏక్ బరస్ మౌసమ్ చార్, మౌసమ్ చార్ మౌసమ్ చార్... పాంచ్ నా మౌసమ్ ప్యార్ కా ఇంతజార్ కా...'


ఆహ్లాదంగా సాగిపోతున్న పాట శ్రవణానందాన్నందిస్తోంది. రిలాక్స్‌డ్‌గా కూచుని ఆ పాట అర్థాన్ని ఆస్వాదిస్తున్నాను. ఆ పాట ఎన్నిసార్లు విన్నా నాకు మళ్లీ మళ్లీ వినాలనే అనిపిస్తుంది.

ఆ పాట నా జీవితానికి, నా మనోభావాలకు దర్పణమా! ఏమో! బాధకి స్పందించాలని కూడా తెలియని వయస్సులో అమ్మ దూరం అయింది. నా జీవితానికి అదో పెద్ద దురదృష్టం.

ఆడపిల్లకి అమ్మ ప్రేమ లేకపోవడమే అన్నింటి కన్నా పెద్ద లోటు. అమ్మ ఎక్కడికో వెళ్లింది, తిరిగి వస్తుందనే చాలా రోజులు ఎదురు చూసాను. ఒక వయసొచ్చి తెలిసే వరకూ బాల్యమంతా అమ్మ ప్రేమకై నిరీక్షణ.

నాకు తల్లి ప్రేమను కూడా అందించాలని నాన్న ఎంతగా తపించారో నాకు తెలుసు. నన్ను మరిపించాలని ఆయన తన సుఖ సంతోషాలను త్యాగం చేసారు. అటువంటి గొప్ప తండ్రిని మభ్య పెట్టి నేను ప్రేమలో పడ్డాను. నాది ఖచ్చితమైన ఎంపిక అనుకున్నాను. శ్రవణ్ నా జీవితానికి స్పష్టమైన గమ్యంగా భావించాను. నాన్న మా పెళ్లికి ఒప్పుకుంటే నా అంత అదృష్టవంతురాలు లేదనుకుని మురిసాను.

తల్లి ప్రేమనంతా శ్రవణ్ సన్నిధిలో తోడుకోవాలనుకున్నాను. నా సేదతీర్చే నీటిచుక్క శ్రవణ్ సహవాసమే అనుకొని కొన్నాళ్లు హాయిగానే వున్నాను. కానీ తర్వాతర్వాత శ్రవణ్ అంటే ఏమిటో అర్థమవసాగాడు. ఏ అభిప్రాయాన్నైనా ముందుగా నేనే వెల్లడించాలంటాడు. ఎలాంటి భావమైనా ముందుగా నేనే పలికించాలి. ప్రేమనురాగాలు ఒలి



# కథ

కించాలి. ఏ సందర్భానికైనా నేనే స్పందించాలి. ఎక్కడికైనా వెళ్లాలంటే నేనే ప్రపోజ్ చేయాలి. అడిగితే కానీ తనకేమీ తెలియదంటాడు.

శ్రవణ్ నన్ను ప్రేమించాడనుకున్నాను. కానీ నా జీవనశోధనలో నేనే అతన్ని ప్రేమించానని అర్థమైంది. నేనలా శ్రవణ్‌ని ప్రేమిస్తూనే వుండాలి. అతని భావాలను నావిగా, అతని ఇష్టాలే నాకూ ఇష్టంగా బతికితే శ్రవణ్‌కి ఇష్టం. ఇలాగే జీవితాంతం సాగాలని అతని ఉద్దేశం. అతనిలాగే నేనూ కోరుకుంటున్నానని తెలుసుకోడు. తెలుసుకున్నా ప్రవర్తించడు. పాట అయిపోయినట్లుగా టేప్‌రికార్డర్ ఆటోస్టాప్ అయింది. ఆలోచనల్లోంచి బయటపడి మళ్లీ రివైండ్ చేసి మళ్లీ అదే పాట పెట్టాను.

కిచెన్‌లోకి వెళ్లి కాఫీ కలుపుకొని తెచ్చుకున్నాను. మంచి కాఫీ రుచిని నాలుక మాత్రమే ఆస్వాదిస్తోంది. మనసు మళ్లీ తలపుల మథనంలో నిండా మునిగింది. మస్తిష్కంలో ఎంతటి సంఘర్షణ వున్నా మనసుకి వున్న ఒకే ఓదార్పు నాన్న. నా దగ్గరకు వచ్చేయమంటే రాలేదు. ఆయన ఒక్కరే జీవనం సాగించారు. ఆయనతో ఒక్కరోజు గడిపినా కొన్నాళ్లపాటు నిబ్బరంగా బతికేటట్లు మనసుకి బలం వచ్చి రీఛార్జ్ అయ్యేది. విధి పనిగట్టుకొని అన్నింటినీ నాకు దూరం చేయాలని దీక్ష బూనిందేమో! ఆయన్ను కబళించి వేసే గొంతు క్యాన్సర్‌ని నాకు బహుమతిగా ఇచ్చింది. ఏ ట్రీట్‌మెంట్‌కీ లొంగక రోజురోజుకీ వ్రణం పెరిగిపోతూ గొంతు మూసుకుపోయి ఆయన మాటే కరువైపోయింది. ఆయన్ని ఆ నరక యాతన నుంచి విముక్తిని చేయమని నేనే భగవంతుడిని ప్రార్థించాను. ఆయన కూడా దూరమయ్యాక మనసు మళ్లీ ఒంటరినయ్యాను. ఎడారిలో దారి తెలియని ప్రయాణికుడిలా.

ఇంతలో బర్రమంటూ కాలింగ్ బెల్ శబ్దం వినిపించగానే తేనెటీగల తుట్ట మీదకి రాయి విసరగానే చెదిరినట్లు తలపులన్నీ చెల్లాచెదురయ్యాయి. తలుపు తీసాను. ఎదురుగా... ఇందీవర.

''హాయ్ రా! ఇందూ! వెల్‌కమ్! సుస్వాగతం!'' అంటూనే దాన్ని హత్తుకుపోయాను.

''ఇంకాసేపుంటే మళ్లీ మీ ఇంటి తలుపులు చేయించుకోవాల్సి వచ్చేది. అయినా అంత పరధ్యానం ఏమిటే?'' కొట్టినంత పనిచేసింది.

''పరధ్యానం కాదే. పాట ధ్యానం. నీకు తెలుసుగా!''

''తెలుసు తల్లీ! నువ్వో నడిచే ఐపాడ్‌వని, పాటలు వింటూ ఉండడం, తిరిగి పాడి మురిసిపోవడం.. ఇవేగా నీ అభిరుచులు.''

నా చిత్తాన్ని ఆమూలాగ్రం చదివేసిన ఇందీవరకు కాక ఇంకెవరికి ఎరుక నా అభిరుచులు?

'పత్‌ఝడ్, సావ..' నేనా పాట అందుకోబోతుండగా,



'అమ్మా! పైడి మాంబా! ఆపవమ్మా!' చేతులు జోడించింది.

''ఎంత ఘోరమైన పరాభవం! అవమానం! బంగారు బొమ్మలా వున్నావని నా మాతాపితులు ఆ అర్థం వచ్చేలా 'హేమశిల్పి' అని నామకరణం చేస్తే ఆ పవిత్ర నామధేయాన్ని పైడిమాంబగా రూపాంతరం చెందించిన నీ మెటమార్ఫసిస్ పరిజ్ఞానానికి నా జోహార్లు'' చిరు అలకగా అన్నాను.

''అవునే! నీ పేరుకు అర్థం బంగారమని, పైడి అన్నా బంగారమేగా! అందుకే కొంచెం వెరైటీగా వుంటుందని అలా పిలిచాను. ఏం తప్పా?'' చిన్నగా మూతి చుట్టింది. ఆ భంగిమ కేవలం ఇందుకే పేటెంట్.

''నన్నెలాగైనా పిలిచే హక్కు ఇంకెవరికీ? ఇంతకీ ఆ పాట అర్థం ఏమిటో తెలుసా?'' కాఫీ కప్పు అందిస్తూ అడిగాను మెత్తగా.

''ఆ పాట విని విని నా చెవులు, దానర్థం పూర్తిగా సంగ్రహించేసిన నా వీనులు తొందరగా ఇఎన్‌టి స్పెషలిస్ట్‌ను కలవమని రిక్వెస్ట్ చేస్తాయేమోనే మోనా! ప్లీజ్!'' వేడికోలుగా అంది ఇందీవర.

వరుసక్రమం అది కాదు కానీ, ట్యూన్ కోసం అలాకూర్చి వుంటారు. శిశిరం, శ్రావణం, వసంతం, శరత్తు ఒక సంవత్సరంలో ఇవి ఋతువులు. ఏదో ఋతువు మాత్రం ప్రేమ కోసం నిరీక్షణ. ఎంత మంచి అర్థమో చూసావా!'' అన్నాను తన్మయంగా. అర్ద్రతకు కళ్లు తడిసాయి.

''హేమూ! ప్లీజ్! డోంట్ గెట్ ఎమోషనల్'' ఆప్యాయంగా భుజం మీద చెయ్యి వేసింది.

''ఎమోషన్స్ నాకు తోడయ్యాయే!' బావురుమన్నాను.

''ప్లీజ్‌రా! నా బుజ్జి బంగారానివి కదూ! కంట్రోల్ చేసుకో!''

''అందరి జీవితాల్లోనూ అన్ని ఋతువులు అనుభవంలోకి రాకపోవచ్చు. కానీ వస్తాయేమోనన్న ఆశ వారిని నడిపిస్తుంది. నాకు ఆ ఆశ కూడా లేదు. జీవితమంతా ఏదో ఋతువే! అంటే నిరంతరం ప్రేమకోసం నిరీక్షణే!''

''ఎందుకంత బేలతనం?''

''బేలతనం కాక?'' నా మనోమథనంలో ఉద్భవించిన భావాల గందరగోళ గరళాన్ని దాని ముందుంచాను.

''ఇదంతా నాకు తెలుసు. ఎడ్జస్ట్ అయిపోవడం తప్ప చేసేదేముంది?'' నన్ను అనునయించాలని ఇందు ఉద్దేశ్యం.

''నీకు తెలియదు ఇందూ! వయస్సుతో పాటు జ్ఞానం కూడా పెరుగుతోంది. ఆ రెండింటితో పాటు నాలో ఈ కాంప్లెక్స్ కూడా పెరిగిపోతోంది. మనసు విప్పి మాట్లాడే మనిషే కరువాయే!''

పలకరింపు మలయ సమీరమైతే, మనసు మేఘం నిల్వ వున్న నీటినంతా వర్షించింది.

''ఇంతకీ నా ఆత్మారాముడిని సంతృప్తి పరిచేదేమైనా వుందా? లేదా? మన గోలలో పడి మరిచేపోయాను. బాబెలా వున్నాడు? శ్రవణ్ ఒకే కదా!'' అడిగింది ఇందు.

''ఉన్న ఒక్క నలుసునీ ఉత్తమ విద్య పేరిట రెసిడెన్షియల్ స్కూల్లో వేసేసాడు శ్రవణ్.

తల్లి ప్రేమనందించలేను. పుత్రవాత్సల్యాన్ని పొందలేను. కనీసం పిల్లవాడు ఇంట్లో వుంటే కొంత సమయం గడిచేది. సరేలే! నీ సంతానం ఎలా వున్నారు? శ్రీవారి ముచ్చట్లు చెప్తావా?'' అడిగాను.

''మా శ్రీవారు పిల్లల్ని తీసుకొని వారి చెల్లిలింటికి దయచేసారు. నాకేమో నీ సమక్షం కావాలని కోరిక. అందుకే పైడమ్మ సన్నిధి అదే నాకు పెన్నిధి అంటూ నీ ముంగిట వాలాను'' అంది ఇందు. దాని అభిమానానికి మనసులోని తడి కళ్లలోకి వచ్చింది. నిజం చెప్పాలంటే ఇందు సన్నిధి ఎప్పుడూ కావాలనే అనిపిస్తుంది. కానీ ఇల్లు కదిలి వెళ్లను. శ్రవణ్ వద్దనడు. కానీ నాకే ఇంట్లోంచి బయటపడాలనిపించదు. కానీ ఇందీవర నేను వెళ్లలేదని మనసులో పెట్టుకోక వీలున్నప్పుడల్లా వస్తూనే వుంటుంది. అందుకు కృతజ్ఞతలు చెప్పాలన్నా కుదరదు. స్నేహబంధంలో 'థాంక్స్' అన్నది అమావాస్య చంద్రుడిలా వుండాలంటుంది ఇందు.

ఇందీవర స్నానం చేసి వచ్చేసరికి భోజనం సిద్ధం చేసాను.

''ఈ పెసరపచ్చడి మా అమ్మ బతికున్న రోజుల్లో తిన్నాను. మళ్లీ ఆ రుచి ఇప్పుడే చూసాను.'' పచ్చట్లో కారానికో, అమ్మ గుర్తొచ్చో దాని కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

''ఈ పచ్చడి నాకు నేర్పింది ఆంటీయేగా!'' అన్నాను. పెసరపప్పు మరీ మెత్తగా కాకుండా, బరకగా వుండేటట్లు ఇంగువ, మిరపకాయలు ఎక్కువేసి రుబ్బుకొని, నిమ్మరసం జోడిస్తే మరింత రుచిగా వుంటుందని ఇందు వాళ్ల అమ్మగారే చెప్పారు.

ఆఖరుగా వేడిగా వున్న చక్రపొంగలి తింటూ ''ఏమైనా సరే! చక్రపొంగలి చేస్తే మీ శ్రీవైష్ణవులే చెయ్యాలే హేమూ!'' స్టాంప్ వేసేసింది.

'హతవిధీ! పదార్థాలకు కూడా వర్గ బేధాలా!' అన్నాను నాటకీయంగా.

ఇద్దరం పక్కపక్కనే పడుకొని ఊసులు కలబోసుకున్నాం.

చిన్నప్పుడు కూడా అంతే! నాన్న క్యాంప్‌కెళ్తే మేమిద్దరం ఇందు అమ్మగారి దగ్గర చెరో పక్క దూరి పడుకునేవాళ్లం

పిల్లిపిల్లలంటూ వెక్కిరించేవాడు ఇందు అన్నయ్య. ఎంతగా ఏడిపించినా బొమ్మల కొలువుకి ఇసుకతో పార్కులు కట్టడం, అట్లతద్దికి గోరింటాకు వెతికి తేవడం మరిచిపోయేవాడు కాదు. అన్నయ్య మౌత్ ఆర్గాన్ వినసొంపుగా వాయించడం నేనెప్పటికీ మరిచిపోలేదు. వాళ్లింట్లో నేను గడిపిన ప్రతీక్షణం మకరంద మాధుర్యమే!

''ఏమైనా కొత్త ఆర్టికల్స్ రాసావా?'' ఇందు ప్రశ్నకి పెదవి విరిచాను.

''ఏం?''

''ఎక్కడా? మనసుకి ఎప్పుడైనా కాస్త ఖాళీ దొరికితే శరీరానికి తీరిక వుండదు. శరీరం సహకరిస్తే మనసెప్పుడూ బిజీగానే వుంటుంది. ఒక కథ రూపొందాలంటే ఎంత ప్రశాంతత, ప్రణాళిక అవసరమో తెలుసా నీకు?'' ఎదురు ప్రశ్నించాను.

''ఎప్పుడో అల్లసాని వారి నిరుహతిస్థలంబు...' చదివిన గుర్తు. కానీ అది వెదుక్కుంటూ నీ దగ్గరకు రావు. నువ్వే సృష్టించుకోవాలి.''

''ఎలాగే! నిత్యం ఆలోచనల సుడిగుండాలే!''

''ఎందుకే నీకు ఆలోచనలు?''

''హేమాయణమంతా విని ఇందుకి హేమ ఏమవతుందన్నట్లుంది''

''నీ సమస్య స్పష్టంగా చెప్పు!'' ఇందు నిలదీసింది.

''నా సమస్య ప్రేమరాహిత్యం. చిన్నప్పటి నుంచి ఏదో ఒక రూపంలో ప్రేమ అందని ద్రాక్షే అవుతోంది. అందితే ఇవెలాగూ పుల్లగానే వుంటాయి కదా అని నక్కలా సరిపెట్టుకోలేకపోతున్నా. ఎంతో ప్రేమను పంచుతాడనుకున్న ప్రేమికుడు మొగుడు కాగానే మామూలు మగాడైపోయాడు.

చిన్నప్పుడే తల్లిప్రేమ, నేను చాలా అదృష్టవంతురాల్ని అనుకునేలా చేసిన తండ్రి ప్రేమ, ఖచ్చితమైన ఎంపికగా మురిసిపోయిన భర్త ప్రేమ,దూరంగా వున్న పుత్ర ప్రేమ.. ఇవన్నీ లోపిస్తే.... ఇవి చాలవా ఒక స్త్రీ జన్మకు! నా మీద నాకే జాలి కలుగుతోందంటే నమ్ముతావా ఇందూ!'' అడిగాను దీనంగా.

''నువ్వు బాధపడుతున్నది ప్రేమ లేక కాదు. సెల్ఫ్ పిటీతో కుంగిపోతున్నావు. నీకు ఎవరి ప్రేమా లేదని నీ మీద నువ్వే జాలిపడిపోతూ బతుకును మరింత భారం చేసుకుంటున్నావు. నిత్యం మానసిక సంఘర్షణతో నీ పరిధిని నువ్వే నిర్ణయించుకుంటున్నావు'' నిజంగా నన్ను బాగా విశ్లేషించింది ఇందు.

'నేను ఒంటరిగా పెరగడం వలన నాకు కుటుంబ వ్యవస్థ మీదున్న గౌరవం అంతా ఇంతా కాదు. నేను ఉమ్మడి కుటుంబాన్ని కోరుకున్నాను. చెప్తే వింతగా వుంటుంది కానీ ఎంతో మంది నన్ను ప్రేమించినా నేను మాత్రం శ్రవణ్‌కే మనసిచ్చాను. కారణం శ్రవణ్‌కి తల్లిదండ్రులు, అన్నయ్య, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. వారందరి మధ్య ఆనందంగా గడిచిపోతుందని ఆశపడ్డాను.

పెళ్లయిన వెంటనే వేరు కాపురమన్నాడు శ్రవణ్. అత్తమామలు కిమ్మనకుండా శ్రవణ్ ఇష్టానికే వదిలేశారు. నా అభిప్రాయం నేను చెప్పినా శ్రవణ్ వినలేదు. విడిగా వుంటే బాధ్యత తెలుస్తుందన్నాడు. తను ఇష్టమొచ్చినంత సేపు ఫ్రెండ్సందరినీ ఉద్ధరించి వస్తాడు. నా భావావేశాలు పట్టవు. నా రాగద్వేషాలు అతనివి కావు. ఇప్పుడిప్పుడే ఇలాంటి వ్యక్తినా నేను ప్రేమించి మంచి ఎంపికగా భావించానా? అనిపిస్తోంది.''

ఇందు వెళ్లిపోతే నా మాట, మనసు మూగపోతాయి. దొరికిన పెన్నిధిని వదులుకునేలా లేదు నా స్థితి.

'నిజమేరా! ప్రేమించి పెళ్లిచేసుకున్న వ్యక్తి ఇలా ప్రవర్తించడం దురదృష్టకరం. కానీ ఎన్నాళ్లిలా నెమరు వేసుకుంటూ వుంటావు? దీనివలన ప్రయోజనం ఏమిటో ఆలోచించావా? నువ్వెంతో తెలివైనదానివి మన ఫ్రెండ్సందరిలో. కాలేజీలో అన్నింటిలోనూ చాలా యాక్టివ్‌గా వుండేదానివి. ఎందుకిలా ఇంట్రావర్ట్ అయిపోతున్నావు?''

''ఇంకా విను. పోనీ నన్ను ప్రేమించకపోతే పోతుంది. మోజు తీరిపోయిందనుకుంటున్నా. కానీ నేను తనని ప్రేమిస్తూనే వుండాలట. అన్నీ డేట్లు ఖచ్చితంగా గుర్తుంచుకొని పాటిస్తుంటాను. కానీ నా పుట్టినరోజు ఎప్పుడో అతనికి గుర్తుండదు. పన్నెండేళ్ల జీవితంలో నాకు సంబంధించిన ఒక్క రోజు కూడా గుర్తుపెట్టుకోలేడా? అందుకే నాకు ఒళ్లు మండి మొన్న శ్రవణ్ బర్త్‌డేకి కనీసం విష్ చేయలేదు. మధ్యాహ్నం లంచ్‌కి వచ్చినప్పుడు ఈరోజు నా బర్త్‌డే విష్ చేయలేదేం! నాకేదోలా అనిపించిందన్నాడు. మరిచిపోయానన్నా. నువ్వా? మరిచిపోవడమా! అంటూ నవ్వాడు. తనకి సంబంధించిన ప్రతి విషయాన్ని నేను మరిచిపోకుండా వుండాలి. అదే తను ఎందుకు చేయడు? నా ఆవేశమంతా అక్షరాలై ప్రతిధ్వనిస్తోంది ఆ నిశ్శబ్దంలో.



''ప్రేమను ప్రేమించు ప్రేమకై' అన్నాడో కవి. నీకు ప్రేమ దొరకాలంటే ప్రేమను పంచుతూనే వుండు. అవతలి వాళ్లు గమనించకపోతే అది వారి ఖర్మ అనుకుని వదిలేయి. అంతే కానీ జరిగినది తల చుకుని కుమిలిపోకు'' చెప్పింది ఇందు.

''అందరి విషయంలోనూ అది జరుగు తుందేమో! కానీ శ్రవణ్ అలా కాదు.''

''నేనేం చెప్పే దానికింకో కారణం చెపుతు న్నావు. ఇంకేమనను? ఊర్లోనే కాబట్టి తరచూ మీ అత్తగారింటికి వెళుతూ వుండు. మనసు మళ్లు తుంది. మారిన మనసు మంచి ఆలోచననిస్తే చక్కటి కథ రాయగలవు'' ఇందు ఇచ్చింది మంచి సలహాయే!

''ఆఁ! అదీ అయింది. ఏం మాట్లాడినా కట్టె, కొట్టె తెచ్చె అని ముగించేస్తారు. కోడలంటే ఒక పూట వచ్చిపోయే అతిథి అని వాళ్ల ఉద్దేశ్యం''

''ఇందూ! ప్రతి మనిషికీ బతకడానికి గుండె అవసరమే కానీ, మనసు ఉండకూడదే! మనసుంటే జీవనం కష్టమే!'' డిక్లేర్ చేసేసాను. ఇందు నిద్రలోకి జారుకుంది. నాకది కరువైంది. ఉదయాన్నే కాఫీ తాగుతూ ఊసులాడుకోవాలని, పెసరట్లకి బదులు ముచ్చట్లనే బ్రేక్‌ఫాస్ట్ చేయాలని, సాయం సంధ్యలో సన్నజాజి పందిరి కింద సాహితీ చర్చలు చేసుకోవాలని, వెన్నెల్లో పాత పాటలు విని మైమరి చిపోవాలని... పైసా ఖర్చులేని కోరికలైనా తీరనివి గానే మిగిలిపోయాయి.

ఆపాత మధురాల లాహిరిలో నేను సోలి వుంటే శ్రవణ్ లేటెస్ట్ మ్యూజిక్ ఆల్బమ్స్ పెడతాడు. రాధామాధవం పూలు సహజంగా వెదజల్లే సువాస నకంటే, ఖరీదైన ఫారిన్ స్ప్రేనే ఇష్టపడతాడు. నావీ, అతనివీ ఒక ఇష్టమూ కలవకపోవడాన్ని విభిన్న ధృక్పథాలు ఆకర్షించుకుంటాయనుకుని సరిపెట్టుకున్నా, ప్రేమ రాహిత్యాన్ని భరించలేక పోతున్నా. అతను అన్ని విధాలా నన్ను ప్రేమించా లని కోరుకోవడమే నేరమా? ఇలా నా ఆలోచనలు తామర తంపరగా సాగుతుండగానే శ్రవణ్ వచ్చాడు. ఒంటి మీద స్పృహలేని స్థితిలో.

కొన్నాళ్ల ముందే మొదలైన కొత్త అధ్యాయం నా జీవితంలో... అతని తాగుడు, తూగుడు, బట్టలైనా మార్చుకోకుండా అలాగా మంచం మీద పడిపో యాడు.

''ఇదెప్పటి నుంచి?'' తెలివొచ్చిన ఇందు అడి గింది ఆశ్చర్యంగా.

''ఏమని చెప్పను నా భాగ్యము? ఏడాదైంది. ఇదొక్కటే నీతో చెప్పనిది'' తలదించుకున్నాను.

తను చెయ్యవలసిన ప్రక్షాళన అంతా నా మెద డుకి చేసేసి వెళ్లిపోయింది ఇందు.

★★★

''ఆంటీ!అక్కా!బావున్నావా?'' పలకరింపుల చిరుజల్లు మనసును తడిపేసింది. అందరినీ ఆప్యా యంగా పేరుపేరునా పలకరిస్తూ నేను తీసుకెళ్లిన చాక్లెట్స్ ఇచ్చాను. అందరూ నా చుట్టూ కూర్చు న్నారు. వారికన్నా పసిపిల్లగా మారాను. వాళ్లతో కలిసి పాటలు పాడాను. ఏవేవో ఆటలు ఆడు కున్నాం. ఆ రోజంతా ఆనందంగా గడిచింది.

''రోజంతా ఆలోచనలతో గడిపేకన్నా కొంత సేపు బయటకు వెళ్లు. ఏ చుట్టాలింటికో కాదు. నీ ప్రేమ కావలసిన వారి దగ్గరకు వెళ్లు. నీలాగే ప్రేమ కోసం అల్లాడే అనాథల దగ్గరకెళ్లి నీ ప్రేమను పంచి నీ మనసులో ఆర్తిని తగ్గించుకో. వారి మనసు నిండా సంతోషం నింపు'' ఇందు చెప్పిన మాటలు యధాతథంగా పాటించాను.

నిజంగానే అభం శుభం తెలియని పిల్లల మధ్య గడిపితే నాలో వెలితి నిండిన భావం కలిగింది.

''నీకు ఎవరో ఏదో ఇవ్వాలని ఆశించకు. అదే నువ్వు ఇంకొకరికి ఇస్తే కలిగే అనుభూతి అనిర్వచ నీయం. నీకు ప్రేమ కావాలి. అంటే దానర్థం నీకు తెలుసు. తెలియని వారు నీకివ్వలేదని బాధపడుతు న్నావు. తెలిసిన నువ్వు నీ ప్రేమని ఎందరికి పంచు తున్నావు?'' ఇందు మాటలు గుర్తొస్తున్నాయి.

''ఏదైనా మనకు లభిస్తే, అందులో సాధక బాధకాలు అనుభవించి మనం కూడా ఆచరించగలం'' అన్నాను.

''అది నిజమే! కానీ ఇచ్చుటలో వున్న హాయి వేరెచ్చటనూ లేనేలేదన్నాడు సినీ రచయిత. నువ్వు ప్రేమను పంచితే రిటర్న్స్ చాలా భారీగా వుంటాయి.''

''చాలా బావున్నాయి రిటర్న్స్'' వెటకారంగా అన్నాను.

''నువ్వు పంచే ప్రేమ అందుకునేది నీ భర్తో, నీ అత్తో, నీ చుట్టమో అనుకోకు. దిక్కుమొక్కులేక, ఏ తప్పుకో తాము బలయి అనాథాశ్రమంలో వుంటున్న పసిపిల్లలు. తమకోసం ఎవరైనా వస్తే బావుండునన్న ఆశ వారిలో వుంటుంది. అక్కడకు వెళ్లు. నువ్వు నిష్కల్మషంగా ప్రేమిస్తే కల్తీలేని అభి మానం నీకు అక్కడే దొరుకుతుంది. ప్రయత్నించి చూడడంలో తప్పులేదు కదా!'' నిజంగా మంచి సలహాలిచ్చి నడిపించడంలో ఇందుకు సాటిలేదు.

మూలన పడేసిన కుట్టు మిషన్‌ని బయటకు తీసాను. ఎప్పుడో సరదాకి నేర్చుకున్న విద్యను వాడుకలోకి తెచ్చాను. పనికిరాని బట్టలు, వాడని చీరలు అన్నీ గౌన్లు, లంగాలు, షర్ట్స్‌గా తిరిగి కుట్టి ఆశ్రమంలో పిల్లలకు ఇవ్వసాగను. అంతేకాదు! నా పేరు మీద నాన్న వేసిన డిపాజిట్ మీద వడ్డీతో ఏడాదికోసారి అందరికీ కొత్త బట్టలు కొనాలని నిర్ణ యించుకున్నాను.

తరచూ వృద్ధాశ్రమానికి వెళుతున్నాను. అయిన వారి ఆదరణకు దూరమైన వారితో సాన్ని హిత్యం పెంచుకున్నాను. నాకు తోచిన సేవ చేస్తు న్నాను. అనురాగ పూరితమైన మాటలతో నన్ను ఆశీర్వదిస్తున్నారు. వారికి నేను ప్రేమను పంచుతు న్నాననుకుంటున్నారు వాళ్లు. నిజానికి నేనే వారి ప్రేమను పొందుతున్నాను.

ఇందు చెప్పినవన్నీ అక్షరసత్యాలు.

''అమ్మ చనిపోయినా, నా మర్యాదలకు ఏం లోటు లేదు పుట్టింట్లో. అన్నయ్య ప్రేమగా చూస్తాడు. ప్రతి పుట్టినరోజుకీ, పెద్ద పండగకీ పట్టు చీరలు కొంటాడు. అది చాలా ఆనందం. కానీ నా ఆడపడుచుకి పసుపు కుంకుమలతో చీర ఇచ్చు కుంటే నాకు చాలా సంతృప్తి కలుగుతుంది. ఏదో సినిమాలో చెప్పినట్లు మనం ప్రేమిస్తున్నాం అంటే ప్రేమని ఇస్తున్నాం, అంటే మనదే అప్పర్ హ్యాండ్.

ప్రేమని పొందాలని తాపత్రయపడడం నేరం కాకపోయినా అందని పళ్లకు అర్రులు చాచకు. కానీ ప్రేమించడం మానకు! శ్రీ మహావిష్ణువు వామనావ తారమెత్తి బలిచక్రవర్తి దగ్గరకు వచ్చాడు. దేవ దేవుడి ఆంతర్యం గ్రహించిన శుక్రాచార్యుడు బలికి హితవు చెప్పబోయాడు.

**అప్పుడు బలిచక్రవర్తి ఏమన్నాడు? సమస్త లోకాలకూ వరదహస్తమై అభయాన్నిచ్చే చేయి, శ్రీమహాలక్ష్మి శరీరంపై ఆ చేయి మర్యాదను పొందు చేయి కిందన వుండి తన చెయ్యి మీదనే వుండడం అదృష్టమన్నాడు.**

కేవలం బలి చక్రవర్తికి మాత్రమే దేవుడికి దాన మిచ్చేంత భాగ్యం కలిగింది. అంటే ఇవ్వడం ఎంతో సంతోషించాల్సిన విషయం. అంతే కాదు గర్వపడా ల్సిన సంగతి. ఇందు ఇచ్చిన ఫీడింగ్ బాగానే పనిచే సింది. శ్రవణ్ ఎలా వున్నా నా ప్రేమను పంచు తూనే వుంటాను. అది కూడా సత్ఫలితాన్ని ఇస్తుందనే నా నమ్మకం.

★★★

''దాయి దాయి దామ్మా! కులికే కుందనాల బొమ్మా!'' ఫోన్ లిఫ్ట్ చేయగానే వినిపించింది.

''చెప్పవే!'' అన్నాను సంబరంగా.

''సండే మ్యాగజైన్‌లో నీ కథ చదివాను. సింప్లీ సూపర్బ్!'' అభినందనల వర్షంలో తడిపేసింది.

''అంతా నీ మహిమే. రియల్లీ ఏ ఫ్రెండ్ ఇన్....''

''ఆఁ! ఆఁ! అంతటితో ఆపు. నిన్ను చూస్తే భయమేసింది. ఏమైపోతావోనని. ఫరవాలేదు. తేరుకున్నావు.''

''నువ్వు వింటే ఆశ్చర్యపోయే సంగతి ఇంకో టుంది'' అంటూ ఫోన్ ఐశ్వర్యకి ఇచ్చాను.

''హాయ్ ఇందూ ఆంటీ!'' మూడేళ్ల ఐశ్వర్య ముద్దులొలికించింది.

''హాయ్! ఎవరూ?'' ఇందు గొంతులో ఆశ్చర్యం.

''ఐశ్వర్య! నా కూతురు!'' చెప్పాను ఆనందంగా.

''మూడు నెలల్లో మూడేళ్ల కూతురా? ప్రపంచం దూసుకుపోతోందని తెలుసు కానీ మరీ ఇంతగా అనుకోలేదు'' అబ్బురంగా అంది ఇందు.

''యూ నాటీ! మిగిలిన వివరాలు సమక్షంలో'' అని ఫోన్ పెట్టేసి ఐశ్వర్యను దగ్గరకు తీసుకున్నాను.

ఇప్పుడు నా జీవితంలో ఏదో ఋతువు వుంది. ప్రేమ కోసం నా నిరీక్షణ కాదు. నా ప్రేమ కోసం నిరీక్షణ!!

★